

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.146	212	241
సూర్యాపేట	రూ.140	210	240
నల్లగొండ	రూ.146	212	241

ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 । కనిష్ఠం 19.4



మునిసిపాలిటీలపై మారుతున్న జెండా


- ఒక్కోటిగా కాంగ్రెస్ ఖాతాలోకి
- కౌన్సిలర్ల జంపింగ్‌లతో మారిన సీన్
- 18 పురపాలికల నుంచి ఆరుకు పడిపోయిన బీఆర్ఎస్
- కాంగ్రెస్‌కు తొమ్మిది, త్వరలో 13కు చేరే అవకాశం

మునిసిపాలిటీల్లో పాలకవర్గాల కైవసానికి కాంగ్రెస్ అమలుచేస్తున్న వ్యూహం ఫలిస్తోంది. కీలకమైన రాజకీయ ప్రాతినిధ్యం ఉండే పురపాలక సంఘాల్లో పాలకవర్గాలు ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటేనే నిధుల కేటాయింపు, పనుల నిర్వహణలో ఆటంకాలు ఉండవనే సూత్రీకరణతో అధికార బదలాయింపు జరుగుతోంది. ఈ మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మునిసిపాలిటీల్లో అధికారమార్పిడి వేగవంతమైంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

ఉమ్మడి జిల్లాలో 2020లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో 19 మునిసిపాలిటీలకు 17 పురపాలికలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఎన్నికల అనంతరం స్వల్పకాలంలోనే చండూరు మునిసిపల్ చైర్మన్ బీఆర్ఎస్‌లో చేరగా, ఆ సంఖ్య 18కి చేరింది. తాజాగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో దేవరకొండ, చిట్యాల, హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్లు కాంగ్రెస్‌లో చేరడంతో అసెంబ్లీ ఎన్నికల నాటికి బీఆర్ఎస్ చేతిలో 15 మునిసిపాలిటీలు ఉండగా, కాంగ్రెస్‌కు నాలుగు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మునిసిపాలిటీల్లో కౌన్సిలర్ల జంపింగ్‌లు, అవిశ్వాసాలతో బీఆర్ఎస్ నుంచి ఒక్కో స్థానం చేజారింది. ప్రస్తుతం ఆరు మునిసిపాలిటీలు మాత్రమే బీఆర్ఎస్ చేతిలో మిగిలాయి. తొమ్మిది మునిసిపాలిటీలు కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. మరో నాలుగు మునిసిపాలిటీల్లో అవిశ్వాసం ప్రక్రియ కొనసాగుతోంది. ఇవి కూడా దాదాపు కాంగ్రెస్ ఖాతాలోకే వస్తుండడంతో ఆ పార్టీ ఆధిక్యత 13 మునిసిపాలిటీలకు చేరనుంది. బీఆర్ఎస్‌కు మిగిలిన ఆరింటిలోనూ చివరి వరకు ఎన్ని ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొంది.

కౌన్సిలర్ల జంప్‌తో కాంగ్రెస్ ఖాతాలోకి



మునిసిపాలిటీ పాలకవర్గాల నాలుగేళ్ల పదవీకాలం పూర్తయ్యాక 74వ రాజ్యాంగసవరణ ప్రకారం చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాసానికి అనుమతిస్తారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మునిసిపల్ పాలకవర్గాల నాలుగేళ్ల పదవీకాలం తీరడంతో అవిశ్వాస తీర్మానాలు మొదలయ్యాయి. నల్లగొండ, కోదాడ, నేరేడుచర్లల్లో ఇప్పటికే అవిశ్వాసాలు పూర్తి కాగా, చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలు కూడా పూర్తయ్యాయి. కాంగ్రెస్ కౌన్సిలర్లు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, సామినేని ప్రమీల, బచ్చలకూరి ప్రకాష్ చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు. భువనగిరి, నందికొండ మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు నెగ్గాయి. ఇక్కడ మెజార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లోకి జంప్ చేయడంతో త్వరలో జరిగే చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ కౌన్సిలర్లే చైర్మన్లుగా ఎన్నికయ్యే అవకాశముంది. హాలియాలో బీఆర్ఎస్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ, మోత్కూరులో బీఆర్ఎస్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిపై అవిశ్వాసం నోటీసులిచ్చారు. ఈ రెండు మునిసిపాలిటీల్లో త్వరలో ఎన్నిక జరగాల్సి ఉంది. హాలియాలో ఇప్పటికే నోటీసు ఇచ్చిన కౌన్సిలర్లలో మెజార్టీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండడంతో త్వరలో ఇది కూడా కాంగ్రెస్ ఖాతాలోకి రావడం ఖాయంగా కనిపిస్తుంటే, మోత్కూరులోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది.

వార్డుల అభివృద్ధి కోసమే అంటున్న కౌన్సిలర్లు

ఉమ్మడి జిల్లాలో పార్టీ ఫిరాయిస్తున్న కౌన్సిలర్లు అంతా దాదాపు ఒకేరకమైన వాదనను వినిపిస్తున్నారు. గడిచిన నాలుగేళ్లలో తమ వార్డులకు నిధుల కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని, చైర్మన్లు, అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే అన్ని పనులు జరగడంతో తాము మిన్నకుండిపోయామని, చివరలోనైనా వార్డుల అభివృద్ధికి అవసరమైన నిధులు వస్తాయనే విశ్వాసం కాంగ్రెస్ నేతలు నుంచి కల్పిస్తుండడంతో పార్టీ ఫిరాయిస్తున్నామని కౌన్సిలర్లు చెబుతున్నారు. అయితే బీఆర్ఎస్ నుంచి వచ్చినవారికి మళ్లీ కౌన్సిలర్‌గా పోటీచేసే అవకాశం కల్పిస్తామని కొన్నిచోట్ల హామీలు లభిస్తే, కొందరికి మాత్రం కాంగ్రెస్ నుంచి అలాంటి హామీలేవీ ఇవ్వలేదని తెలిసింది. ఇప్పుడు పార్టీ మారిన కౌన్సిలర్లకు, వారిపై పోటీచేసి ఓడిన కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య ఇప్పటికే కొన్ని మునిసిపాలిటీల్లో వర్గపోరు మొదలవడం, భవిష్యత్ రాజకీయాలపై ప్రభావం చూపనుందని భావిస్తున్నారు.

రెండు మునిసిపాలిటీల్లో బెడిసిన అవిశ్వాసం

సూర్యాపేట, ఆలేరు మునిసిపాలిటీల్లో అవిశ్వాస తీర్మానాలు బెడిసికొట్టాయి. సూర్యాపేటలో అవిశ్వాసానికి చివరి నిమిషంలో ఓ కౌన్సిలర్ దూరంగా ఉండటంతో వీగింది. ఆ తరువాత 15 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం 24కు చేరి మెజార్టీ సాధించింది. అయితే మరోసారి అవిశ్వాసానికి తావులేకపోవడంతో నిధుల కేటాయింపులు, అభివృద్ధి విషయంలో వార్డుల మధ్య సమతుల్యత ఉంటుందనే అభిప్రాయం పార్టీ మారిన కౌన్సిలర్లలో వ్యక్తమవుతోంది. ఆలేరులోనూ అవిశ్వాసం వీగింది. దీంతో ఈ రెండు మునిసిపాలిటీల్లో బీఆర్ఎస్ చైర్‌పర్సన్లే పూర్తి పదవీకాలం కొనసాగనున్నారు.

18 నుంచి ఆరుకు పడిపోయిన బీఆర్ఎస్ బలం

ఉమ్మడి జిల్లాలో 19కి 18 మునిసిపాలిటీల్లో గులాబీజెండా ఎగురవేసిన బీఆర్ఎస్, అసెంబ్లీ ఎన్నికల తరువాత వాటిని నిలబెట్టుకోలేకపోయింది. దూకుడు మీద ఉన్న కాంగ్రెస్ ఒక్కో మునిసిపాలిటీని క్రమంగా తన ఖాతాలో వేసుకుంటూ వస్తుండగా, చిరికి బీఆర్ఎస్‌కు మిర్యాలగూడ, సూర్యాపేట, తిరుమలగిరి, నకిరేకల్, చండూరు, ఆలేరు, భూదాన్‌పోచంపల్లి మాత్రమే మిగిలాయి. వీటిల్లోనూ తిరుమలగిరిలో రేపో, మాపో అవిశ్వాసం ప్రవేశపెడతారనే చర్చసాగుతుంటే, మిగిలిన వాటిల్లో నకిరేకల్ పాలకవర్గానికి నాలుగేళ్ల గడువు ఇంకా పూర్తికాకపోవడంతో ఇక్కడ అవిశ్వాసానికి ఛాన్స్ లేదు. సూర్యాపేట, ఆలేరులో ఇప్పటికే అవిశ్వాసం వీగడంతో ఈ ఇద్దరు బీఆర్ఎస్ చైర్మన్లు పూర్తిపదవీకాలం కొనసాగుతారు. మిగిలిన మిర్యాలగూడ, చండూరు, భూదాన్‌పోచంపల్లిల్లో మాత్రం అవిశ్వాసాలపై ఎలాంటి కార్యాచరణ లేదు.

భవ భయ హరుడి కల్యాణం
భక్తజన పరవశం

- నేత్రపర్వంగా చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరుని కల్యాణం
- హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



చెర్వుగట్టు దేవస్థానంలో స్వామివారి కల్యాణంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 17: హర హర మహాదేవ.. శంభో శంకర.. ఓం నమః శ్శివాయ.. అంటూ భక్తుల శివన్నామ స్మరణలు, యాజ్ఞికులు.. రుత్వికులు.. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పరాశక్తి పార్వతీ మాతతో సకల భూతనాథుడైన సదాశివుడి కల్యాణ మహోత్సవం శనివారం తెల్లవారు జామున కన్నుల పండువగా సాగింది.

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని శైవాగమోక్తంగా నిర్వహించారు. పుష్పాలతో అలంకరించిన కల్యాణ మండపంలో, విద్యుత్ దీపాలంకరణల నడుమ జరిగిన ఈ వేడుక భక్తులను పరవశులను చేసింది. ఉత్సవానికి రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు ప్రభుత్వం తరఫున అందజేశారు. యాజ్ఞికుడు అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితులు, ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో కల్యాణతంతు జరగ్గా, నీలకంఠశాస్త్రి వ్యాఖ్యానం భక్తులను కట్టిపడేసింది. తొలుత వాహన సేవలతో ఉత్సవ మూర్తులను మహాపండపం నుంచి కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహావాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, కన్యాదానం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ ఘట్టాలను వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. నవదంపతులైన పార్వతీ పరమేశ్వరులకు తలంబ్రాల బియ్యాన్ని పెద్ద ఎత్తున సమర్పించారు. కార్యక్రమంలో ఆర్డీవో రవి, నల్లగొండ మునిసిపల్ కమిషనర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బత్తుల ఊశయ్య, రేగట్టె నర్సిరెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, బండా సాగర్‌రెడ్డి, నేతకాని కృష్ణయ్య, నల్ల వెంకన్న, గడుసు శశిధర్‌రెడ్డి, వారాల రమేశ్, రేగట్టె నవీన్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, జెర్రిపోతుల భరత్, రాధారపు భిక్షపతి, ఎంపీటీసీలు పుల్లెంల ముత్తయ్య, మేకల రాజిరెడ్డి, కొందూరు శంకర్, ఏసీ మహేంద్రకుమార్, ఈవో సిరికొండ నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. కాగా, కల్యాణం రోజు భక్తులు సమర్పించిన కానుకల హుండీని సాయంత్రం 4గంటలకు లెక్కించారు. ఒక్క రోజులో రూ.9,90,520 ఆదాయ ఖజానాకు సమకూరాయి. గత ఏడాది కల్యాణం సమయంలో రూ.6,18,725 ఆదాయం మాత్రమే సమకూరింది. అదేవిధంగా స్వామివారిని సినీదర్శకుడు శంకర్ దంపతులు దర్శించుకున్నారు.

మాస్టర్ ప్లాన్‌తో చెర్వుగట్టు క్షేత్రాభివృద్ధి : మంత్రి వెంకట్‌రెడ్డి

చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని మాస్టర్ ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొనడం తనకు సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని త్వరలో చెర్వుగట్టుకు తీసుకువస్తానన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించి దేవస్థాన అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ప్రధానంగా గుట్టపైకి రెండో ఘాట్‌రోడ్, డార్మెటరీ హాల్‌లను నిర్మిస్తామన్నారు. రానున్న మూడు నెలల్లో బీ.వెల్లెంల ఉదయసముద్రం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేయించి సుమారు 50 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని మంత్రి ప్రకటించారు.

మైనింగ్ విస్తరణకు ప్రజల సంపూర్ణ మద్దతు

- 56 మందికి 53 మంది అనుకూలం
- కార్పొరేట్ ఆస్పత్రి ఏర్పాటుకు డిమాండ్
- పరిశ్రమ పరిధిలోని మినరల్ ఫండ్‌తో అభివృద్ధి కృషి : పరిశ్రమ యాజమాన్యం



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

మఠంపల్లి,ఫిబ్రవరి17: మఠంపల్లి మండలంలోని సాగర్‌సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో పెదవీడు రెవెన్యూలో మైనింగ్ విస్తరణకు శనివారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపారు. గ్రామ శివారులోని 326.58 హెక్టార్లలో 3.3మిలియన్ టన్నుల నుంచి 5.04 మిలియన్ టన్నుల వరకు విస్తరణకు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధ్యక్షతన అభిప్రాయ సేకరణ జరిగింది. మొత్తం 56 మందిలో 53మంది అనుకులంగా మరో ముగ్గురు వ్యతిరేకంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఎక్కువ శాతం స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, 15 ఏళ్ల నుంచి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు కంపెనీ ఉద్యోగాలు ఇవ్వాలని, పరిశ్రమ పరిధిలోని గ్రామాల ప్రజలకు, పేదపిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం అందించేందుకు పాఠశాల, ఆస్పత్రి ఏర్పాటుచేసి నిర్వహణ చేయాలని, మినరల్, డీఎంఎఫ్ నిధులతో గ్రామాలు, తండాల్లో మౌలిక వసతులు కల్పించాలని, వాతావరణం కాలుష్య నివారణకోసం విరివిగా మొక్కలు పెంచాలని, వాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని, హరితహత వనాలను పెంచాలని ప్రత్యేక చర్యలు చేపడతామని స్పష్టమైన హామీ ఇవ్వాలని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

యధావిధిగా పర్యావరణ శాఖకు పంపుతాం : కలెక్టర్

ప్రజాభిప్రాయ సేకరణ సభలో ప్రజలు వ్యక్తం చేసిన విషయాలను, అభిప్రాయాలను లైవ్ రికార్డు చేసి, అవన్నీ యధావిధిగా కేంద్ర పర్యావరణ శాఖ పంపుతామని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. ప్రజలు వ్యక్తం చేసిన విషయాల్లో ముఖ్యంగా వైద్యం గురించి అడిగారని, తప్పకుండా పరిశ్రమ వారితో మాట్లాడి కార్పొరేట్ ఆస్పత్రి నిర్మించి డాక్టర్లను ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తామన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మినరల్ ఫండ్‌పై చర్చించి పరిశ్రమ ప్రాంతాల అభివృద్ధికి మంచి నిర్ణయం తీసుకుంటామన్నారు. పర్యావరణ, రెవెన్యూ శాఖఅధికారులతో సంయుక్తంగా పరిశ్రమ పరిధిలోని గ్రామాలను సర్వేద్వారా రెడ్‌జోన్, గ్రీన్ జోన్‌లుగా గుర్తించాలని ఆదేశాలిచ్చారు. పరిశ్రమ వారు చేపట్టే పనులకు సూచిక బోర్డులను ఏర్పాటు చేసేలా చూడాలని ఆదేశించారు. పరిశ్రమ పరిధిలో సమస్యలు ఉంటే రైతులతో చర్చించి పరిష్కరించుకోవాలని, ఎవర్ని ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు.

పిటిషనర్లు అందుబాటులో లేరు

పెదవీడుకు చెందిన వేముల పద్మతోపాటు మరో 12 మంది హైకోర్టులో పరిశ్రమ ఏర్పాటుపై పిటిషన్ చేశారని కలెక్టర్ తెలిపారు. పిటిషనర్లను నేరుగా అభిప్రాయ సేకరణలో పాల్గొని తమ అభిప్రాయం వ్యక్తం చేయాలని హైకోర్టు ఆర్డరు ఇచ్చిందని, పలు మార్లు పిలిచినా వారు అందుబాటులో లేరని తెలిపారు. అవసరమైతే వారు రాత పూర్వకంగా అందించవచ్చన్నారు. తమకు స్వయంగా 38 మంది పరిశ్రమ మైనింగ్‌కు అనుకులంగా దరఖాస్తు ఇచ్చారనికలెక్టర్ తెలిపారు.

హామీలను నెరవేరుస్తాం: సాగర్ సిమెంట్ ప్రెసిడెంట్, ఎంవీ రమణమూర్తి

ప్రజాభిప్రాయసేకరణలో ప్రజలు వ్యక్తం చేసిన ప్రతీ డిమాండ్‌ను తప్పనిసరిగా నెరవేరుస్తామని సాగర్ సిమెంట్ ప్రెసిడెంట్,ఎంవీ రమణమూర్తి అన్నారు.విద్య, వైద్యంతోపాటు పరిశ్రమ పరిధిలోని గ్రామాలు, తండాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామన్నారు. నిబంధనల విషయంలో సాగర్ సిమెంట్ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సతీష్‌కుమార్, పర్యావరణ శాఖ ఈఈ సురేష్‌బాబు, హుజూర్‌నగర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ మంగారాథోడ్, డీఎస్పీ శ్రీదర్‌రెడ్డి, సీఐలు జి.చరమందరాజు, రజితారెడ్డి పాల్గొన్నారు.

రేపు వెల్లంకికి గవర్నర్ తమిళిసై రాక

విఠలాచార్య గ్రంథాలయాన్ని ప్రారంభించనున్న సౌందర రాజన్



వెల్లంకి గ్రామంలోని ఆచార్య కూరెళ్ల గ్రంథాలయంలోని పుస్తకాలు

రామన్నపేట ఫిబ్రవరి 17: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సోమవారం ఉదయం 11 గంటలకు రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి రానున్నారు. ప్రముఖ సాహితీవేత్త, కవి, రచయిత, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య తన సొంత ఇంటిని గ్రంథాలయంగా మార్చి నూతనంగా నిర్మించిన ఆచార్య కూరెళ్ల భవనాన్ని ఈ నెల 19న ఉదయం 11గంటలకు గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ప్రారంభించనున్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే, ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పోరెడ్డి రంగయ్య తదితరులు పాల్గొననున్నారు. రూ.కోటి వ్యయంతో నూతనంగా నిర్మించిన ఈ గ్రంథాలయంలో 2లక్షల పైచిలుకు పుస్తకాలు ఏర్పాటు చేశారు. గ్రంథాలయ నూతన భవనం, పైఅంతస్తులో సభా మందిరం ప్రారంభంతోపాటు కూరెళ్ల విఠలాచార్య రచించిన విఠలేశ్వర శతకాన్ని ఆవిష్కరించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు కూరెళ్ల నరసింహాచారి తెలిపారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా నల్లగొండ జిల్లా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరవుతారని చెప్పారు. సదస్సులో 'సమాజం-గ్రంథాలయాలు' అంశంపై కవి ఏనుగు నరసింహరెడ్డి, పరిశోధనా గ్రంథాలయంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణ కౌండిన్య, దాసోజు పద్మావతి ప్రసంగిస్తారని చెప్పారు.

గవర్నర్ రాక ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో

రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ రాక సందర్భంగా సభా ఏర్పాట్లను చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి శనివారం గ్రామాన్ని సందర్శించి పనులను పరిశీలించారు ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెల్ల విఠలాచార్యను సత్కరించారు. సభా స్థలాన్ని, నూతన గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాల్ బహదూర్, లయన్స్ క్లబ్ సభ్యులు గోవర్ధన్‌చారి, అడ్వకేట్ గోవర్ధన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



మేళ్లచెర్వు శివాలయం, పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 17: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు మరో 15 రోజులే గడువు ఉన్నందున, సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. మండలకేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి వారి ఆలయ పరిసరాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో స్వామివారిని దర్శించుకునే భక్తులసంఖ్య గతంలో కంటే అధికంగా ఉంటుందని, అందుకు తగినట్లు ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. బారీకేడ్లు ఏర్పాటుచేసి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, ఆలయ పరిసరాలు, రోడ్ల వెంట ఉన్న చెత్తాచెదారం, అక్రమ నిర్మాణాలు తొలగించాలన్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు, ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయాలని, జాతరకు వచ్చే భక్తులకు తాగునీరు ఇబ్బంది లేకుండా చూడాలని, ఆలయ ప్రాంగణంలో, గ్రామంలోని అంతర్గత రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపీ కొట్టె పద్మ, సైదేశ్వరరావు, జడ్పీటీసీ పద్మ గోవిందరెడ్డి, తహసీల్దార్ జ్యోతి, సీఐ రజితారెడ్డి, ఎంపీడీవో ఖాజా అసర్గ్ అలీ, ఎస్‌ఐ పరమేష్, ఈవో కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జైళ్లు పరివర్తన కేంద్రాలు

ప్రిన్సిపల్ జిల్లా జడ్జి రాజగోపాల్

సూర్యాపేటలీగల్, ఫిబ్రవరి 17: జైళ్లు పరివర్తన కేంద్రాలు అని ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి.రాజగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జైలును ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులకు పశ్చాత్తాపం జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతుందన్నారు. నేర ప్రవృత్తికి పాల్పడకుండా సన్మార్గంలో జీవిస్తూ సమాజంలో ఆదర్శంగా జీవించాలన్నారు. నేరస్తుల తల్లిదండ్రులు, భార్యా పిల్లలను సమాజం చిన్నచూపు చూస్తోందన్నారు. ప్రేమవ్యవహారాలు, మత్తు పదార్థాలు యువత జీవితాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. అంతకుముందు జైలులో మౌలిక వసతులను పరిశీలించారు. ఖైదీల వ్యక్తిగత వివరాలను తెలుసుకొని, నేరాలు చేయబోమని వారితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ పి.శ్రీవాణి, జిల్లా లీగల్ ఎయిడ్ కౌన్సిలర్లు వసంత సత్యనారాయణపిళ్లై, పి.వాణి, బొల్లెద్దు వెంకటరత్నం, ఏడిండ్ల అశోక్, జైలు సూపరింటెండెంట్ సుధాకర్‌రెడ్డి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తే మంచి గుర్తింపు



సురేష్‌ను సన్మానిస్తున్న జడ్పీ కార్యాలయ సిబ్బంది

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 17: అంకిత భావం, నిబద్ధతతో పనిచేస్తే ప్రభుత్వ ఉద్యోగులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక అన్నారు. శనివారం జడ్పీ సీఈవో జి.సురేష్ బదిలీపై యాదాద్రిభువనగిరి జిల్లా అడిషనల్ డీఆర్‌డీవోగా వెళ్తున్న సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ అధికారులకు బదిలీలు సాధారణమని, ఏ ప్రాంతంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించినా ఆ ప్రాంత ప్రజల మన్ననలను పొందాలన్నారు. సురేష్ నిబద్ధత కలిగి విధులు నిర్వర్తించారని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల మన్ననలను పొందారన్నారు. అనంతరం జడ్పీ కార్యాలయం ఉద్యోగులు సురేష్‌ను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో నూతన జడ్పీ సీఈవో వీవీ అప్పారావు, అదనపు సీఈవో డీ శిరీష, సూపరింటెండెంట్ కే విజయకుమారి, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 17: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని సూర్యాపేట పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ సీఐ రాజశేఖర్ విలేకరుల సమావేశంలో శనివారం వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని జమ్మిగడ్డ ప్రాంతంలోని జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పక్కనే ఉన్న రాజీవ్ పార్కులో అనుమానంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించారు. పెన్‌పహాడ్ మండలం మాచవరం గ్రామానికి చెందిన బొమ్మగంటి గోపి, ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్ల గ్రామానికి చెందిన దండిగ ప్రసాద్, సూర్యాపేట పట్టణంలోని కస్తూరిబజార్‌కు చెందిన తులసీ సాయికిరణ్‌లు ముగ్గురు స్నేహితులు. బొమ్మగంటి గోపి ఒరిస్సా ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి స్నేహితులతో కలిసి పీల్చుతూ మిగిలిన గంజాయిని పట్టణంలోని పలు కాలేజీలు, ఇతర వ్యక్తులకు విక్రయించేవారు. ఇదే క్రమంలో శనివారం గోపి గంజాయిని తీసుకొని వచ్చి రాజీవ్‌పార్కు వద్ద దండిగ ప్రసాద్, తులసీ సాయికిరణ్‌కు ఇచ్చే క్రమంలో పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 250 గ్రాముల గంజాయితో పాటు రెండు బైకులు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో పట్టణ ఎస్‌ఐలు బాలకృష్ణ, లోకేష్, సిబ్బంది ఆనంద్, వెంకటేష్ పాల్గొన్నారు

దైవదర్శనానికి వెళ్లి వస్తూ రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 17: దైవదర్శనానికి వెళ్లి వస్తూ ఓ మహిళ తిరిగిరాని లోకాలకు వెళ్లింది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్‌పీ రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం బొమ్మేపల్లి గ్రామానికి చెందిన దాసరి కోటేష్, లక్ష్మమ్మ(28) దంపతులు తమ కుమారుడు శివతో కలిసి శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు వెళ్లారు. స్వామి వారి దర్శనం అనంతరం మధ్యాహ్నం చెర్వుగట్టు నుంచి స్వగ్రామమైన బొమ్మేపల్లికి బయలుదేరారు. మార్గమధ్యలో నల్లగొండ పట్టణంలోని ఆర్‌పీ రోడ్డులోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న లక్ష్మమ్మ టిప్పర్ టైర్ల కిందపడగా భర్త కోటేష్, కుమారుడు శివ మరోవైపు పడిపోయారు. ప్రమాదంలో టైర్ల కింద పడిన లక్ష్మమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, భర్త కుమారుడికి స్వల్పగాయాలయ్యాయి. మృతురాలి సోదరుడు జానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్థక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్థక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతోపాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై మైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్.. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై మైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా... సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై మైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్ప గుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాపికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్‌నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్ రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

కాళేశ్వరం కుంగితే ఎలా సమర్థించుకుంటారు?

● *శాసనసభలో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్*

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో మూడు నాలుగు పిల్లర్లు కుంగితే ఏమవుతుందన్న కేసీఆర్... అసలు కుంగిన విషయాన్ని ఎలా సమర్థించుకుంటారని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ ప్రశ్నించారు. నదీ జలాల విషయంలో నల్లగొండకు తీవ్ర అన్యాయం చేసిందే కేసీఆర్ అని మండిపడ్డారు. జిల్లా ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై శాసనసభలో జరిగిన చర్చలో బాలునాయక్ మాట్లాడారు. కేసీఆర్ సర్కారు రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని ఆరోపించారు. కేవలం దళితుల ఓట్లను దండుకునేందుకు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. సాగుచేస్తున్న రైతులకు రైతు భరోసా ఇస్తామని, భూస్వాములకు బంద్ చేస్తామన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బాగుందన్నారు.

సీపీఆర్ చేసి కోతి ప్రాణాలు కాపాడిన యువకుడు



సూర్యాపేటరూరల్, ఫిబ్రవరి 17: కోతికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలం కాసరబాద గ్రామానికి చెందిన యువకులు. మండల పరిధిలోని కాసరబాద గ్రామంలో శనివారం కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి కోతి విద్యుదాఘాతంతో కిందపడి అపస్మారకస్థితిలో పడిపోయింది. అటుగా వెళ్తున్న గ్రామానికి చెందిన పోలగాని రాము, కారింగుల సతీష్ కలిసి అపస్మారకస్థితిలో ఉన్న కోతికి సీపీఆర్ చేయడంతో కోతి ప్రాణాలతో బయటపడింది. సీపీఆర్‌పై అవగాహన ఉండడంతో కోతి ప్రాణాలు కాపాడగలిగామని ఆ యువకులు ఆనందం వ్యక్తం చేశారు.

బాలిక మృతిపై డీఎంహెచ్‌వో విచారణ

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 17: తొమ్మిదేళ్ల బాలిక కాలుకు శస్త్రచికిత్స నిర్వహించేందుకు ఇచ్చిన మత్తుమందు వికటించి మృతిచెందిన సంఘటనపై జిల్లా వైద్యాధికారి కొండల్‌రావు విచారణ జరిపారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం రెడ్డికాలనీలోని శ్రీసాయి ఆర్థోకేర్ ఆస్పత్రిని శనివారం తనిఖీ చేసి బాలికకు అందించిన వైద్యసేవలపై ఆరాశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శస్త్రచికిత్సకు ముందు ఆస్పత్రికి చెందిన ఆర్థోపెడిక్ డాక్టర్ స్వయంగా బాలికకు మత్తుమందు ఇచ్చినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. అనస్తీషియా పర్యవేక్షణలో మత్తుమందు ఇవ్వాల్సి ఉండగా, అలాంటి జాగ్రత్తలేవి వైద్యుడు పాటించలేదని, మోతాదుకు మించి మత్తుఎక్కించడంతో బాలిక కోమాలోకి వెళ్లిమృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. సంఘటనపై ఆస్పత్రి డాక్టర్ శ్రీనివాసరాజు వాంగ్మూలాన్ని సేకరించిన్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. విచారణలో గుర్తించిన అంశాలపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు.

శాస్త్రోక్తంగా పాతగుట్ట అధ్యయనోత్సవాలు

● రాత్రివేళ నమ్మాళ్వార్ పరమపదోత్సవం ● లక్ష్మీనృసింహుడికి వైభవంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 17: పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శనివారం మూడో రోజు వార్షిక అధ్యయనోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. పాతగుట్ట ప్రధానాలయంలో కొలువుదీరిన స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపిన ఆచార్యులు లక్ష్మీనృసింహుడికి, ఆళ్వార్లను కొలుస్తూ నవకలశ స్నపన తిరుమంజనాలు నిర్వహించారు. ఆలయ ప్రాశస్త్యం కోసం నిర్వహించే అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వయంభూ లక్ష్మీనృసింహుడిని, ఆళ్వార్లను సేవల్లో తీర్చిదిద్ది పొరపాట్లు సేవోత్సవం నిర్వహించారు. అలంకార సేవ ముందు అర్చకబృందం, రుత్వికులు దివ్య ప్రబంధ వేదపఠనం చేశారు. రాత్రివేళ పరమపదోత్సవ ఘట్టాలు నేత్రపర్వంగా సాగాయి. అధ్యయనోత్సవాల్లో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్న నమ్మాళ్వార్ పరమపదోత్సవ ఘట్టాలను సంప్రదాయరీతిలో నిర్వహించారు. ఆళ్వారాచార్యుల తిరునక్షత్ర వేడుకల్లో భాగంగా ఆళ్వార్లు అందించిన దివ్య ప్రబంధ పాశుర పఠనాలతో సేవోత్సవం నిర్వహించడం సంప్రదాయం. శ్రీవైష్ణవ దేవాలయాల్లో అధ్యయనోత్సవాల పరిసమాప్తికి ముందు రోజున పరమ భక్తాగ్రేసుడు, ఆళ్వారాచార్యులు నమ్మాళ్వార్ పరమపదోత్సవం నిర్వహించడం ఆచారం. శ్రీమన్నారాయణుడి పాదాల అంశతో భువిలో ఆవిర్భవించిన నమ్మాళ్వార్ పరమపదం పొంది, తిరిగి భగవానుడి సన్నిధిని చేరే వైదిక ఘట్టాలను అర్చకులు, రుత్వికులు, వేద పండితులు నేత్రపర్వంగా నిర్వహించారు.



అలంకార సేవ ముందు వేదపఠనం చేస్తున్న అర్చకబృందం



అలంకార సేవను తిరువీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు

లక్ష్మీనృసింహుడికి వైభవంగా నిత్య పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శనివారం నిత్యకల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగింది. కొండపైన ప్రధానాలయ అష్టభుజి ప్రాకార దక్షిణ దిశలోని కల్యాణమండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన ఆచార్యులు గజవాహన సేవలో తీర్చిదిద్ది సేవోత్సవం జరిపి విశ్వక్సేనుడికి తొలి పూజలతో కల్యాణ తంతు నిర్వహించారు. ముందుగా ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, సుదర్శన నారసింహ హోమ పూజలు నిర్వహించారు. శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజలు శైవామ పద్ధతిలో నిర్వహించారు. ఇదిలా ఉండగా స్వామికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన మొక్కుకానుకలను ఈ నెల 20వ తేదీన లెక్కించనున్నట్టు దేవస్థాన ఈవో రామకృష్ణారావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.21,40,358 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

పీవోడబ్ల్యూ సంధ్య భర్త అంత్యక్రియలు పూర్తి

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 17: ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జాతీయ కన్వీనర్ సంధ్య భర్త, హైదరాబాద్‌లోని నవ్య ప్రింటింగ్ ప్రెస్ యజమాని రామకృష్ణారెడ్డి అంత్యక్రియలు ఆయన స్వగ్రామంలో కన్నీటి వీడ్కోల నడుమ ముగిశాయి. రామకృష్ణారెడ్డి అంత్యక్రియలను శనివారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరడలోని వారి వ్యవసాయ క్షేత్రంలో పూర్తిచేశారు. రామకృష్ణారెడ్డి భౌతిక కాయంపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ పూలమాలలువేసి నివాళులర్పించి సంధ్య, కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి రమేష్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి, పీడబ్ల్యూవో రాష్ట్ర కార్యదర్శి సుభద్ర, ఏపీ రాష్ట్ర నాయకురాలు పద్మ ఉన్నారు.



నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

ఆత్మవిశ్వాసంతో అనుకున్నది సాధించాలి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 17: ఆత్మవిశ్వాసంతో అనుకున్న లక్ష్యాలు సాధించాలని ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి, యంగెస్ట్ పీహెచ్‌డీ హోల్డర్, మోటివేషన్ స్పీకర్ డాక్టర్ నైనా జైశ్వల్ అన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో శనివారం ఏర్పాటుచేసిన మోటివేషన్ కార్య కమంలో మాట్లాడారు. కఠోర సాధన చేస్తేనే ఉన్నత స్థాయికి చేరుకోగలుగుతామన్నారు. ఆవేశానికిలోను కావొద్దన్నారు. యువత చెడు మార్గాల్లో పయనించవద్దన్నారు. దేశంలో ఆడపిల్లలకు ఎంతో ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఉందని, ఆడపిల్ల ఆదిపరాశక్తి అన్నారు. సమాజంలో గెలుపుకన్నా ఓటమి ఎంతో గొప్పదని, ఓటమి మనిషిని ఉన్నత స్థాయిలో నిలబెడుతుందని అసిస్టెంట్ కమిషనర్ పిన్నని సందీప్‌భాగా అన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు సాధించాలంటే క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు భయపడుతూ పరీక్షా కేంద్రాలకు పోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌వుడ్ చైర్మన్ తుమ్మా మర్రెడ్డి, డైరెక్టర్ సరితారెడ్డి, కృష్ణారావు, రాజారెడ్డి, నైనా అగస్త్య, అశ్వనికుమార్, భాగ్యలక్ష్మీ, పిన్నని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చచ్చిపోలేక... బతికున్నాం

● కుమారుడు, కోడలు వేధిస్తున్నారు: తల్లిదండ్రులు ● అప్పులు తీర్చేందుకు అప్పులపాలయ్యా: కుమారుడు ● హైకోర్టును ఆశ్రయించిన తండ్రి

సూర్యాపేట, ఆత్మకూరు(ఎస్), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తన తండ్రి ఆస్తిని కుమారుడు అక్రమంగా అతడి పేరు మీదకు మార్చుకుని వీధిన పడేశాడని ఓ తండ్రి ఆందోళన.. చెల్లెళ్ల పెళ్లిళ్ల కోసం చేసిన అప్పులను తీర్చేందుకు తాను అప్పులపాలయ్యానని, వారసత్వంగా వచ్చిన ఆస్తిని విక్రయించి బయటపడాలని కుమారుడి ఆవేదన.. వృద్ధులైన తమకు న్యాయం చేయాలని తండ్రి హైకోర్టును ఆశ్రయించాడు. ఆ తండ్రీకుమారుల ఘర్షణ ఉదంతానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం శంకన్నగూడేనికి చెందిన సామ పాపిరెడ్డి, సుగుణమ్మ దంపతులకు ఐదుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పాపిరెడ్డి తన కుమారుడికి, కుమార్తెలందరికీ వివాహం చేశాడు. వివాహాల కోసం అప్పులయ్యాయి. కుమారుడు శంకర్‌రెడ్డి అందరిలో పెద్దవాడు. కాగా, పాపిరెడ్డి తనకున్న 2.10ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించాడు. 1986లో పదో తరగతి ఫెయిల్ కావడంతో శంకర్‌రెడ్డి జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. ఆయనకు భార్య భవానీతో పాటు కుమారుడు, కుమార్తె కాగా ఏడేళ్ల క్రితం కుమారుడు చనిపోయాడు. కుటుంబ అవసరాలు, బంధువుల పెళ్లిళ్లు ఇతర అవసరాల కోసం శంకర్‌రెడ్డి స్వగ్రామానికి అప్పుడప్పుడు వచ్చి వెళుతుండేవాడు. 40ఏళ్ల కిందటే హైదరాబాద్‌కు వెళ్లిన శంకర్‌రెడ్డికి అక్కాచెల్లెళ్లతో పెద్దగా సత్సంబంధాలు లేవు. పెద్ద కుటుంబం కావడం, ఐదుగురు ఆడపిల్లల పెళ్లిళ్ల వగైరా ఖర్చులతో కొంత రుణభారం ఏర్పడింది. వృద్ధాప్యంలో ఉన్న పాపిరెడ్డి దంపతులు వ్యవసాయం చేయడం కష్టంగా ఉందని ఉన్న భూమిని సాగుచేసుకుంటూ రుణభారం తీర్చి తమకు భుక్తం ఇవ్వాలని కుమారుడిని కోరారు. వ్యవసాయంలో అనుభవం లేని కుమారుడు శంకర్‌రెడ్డి కొద్దిపాటి వ్యవసాయంతో తన కుటుంబాన్ని, తల్లిదండ్రులను సాకడం కష్టమని తండ్రికి చెప్పాడు. ఇరువురూ పెద్దలను ఆశ్రయించగా వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను కుమారుడు పోషించాలని పెద్దలు సూచించారు. రెండు ఎకరాల వ్యవసాయ భూమితో పోషణ కష్టమని కుమారుడు శంకర్‌రెడ్డి తిరిగి హైద్రాబాద్‌కు వెళ్లిపోయాడు. దాంతో పాపిరెడ్డి పోలీసులకు, ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.

నాకు తెలియకుండా పట్టా చేయించుకున్నాడు: పాపిరెడ్డి

శంకన్నగూడెంలో నాకున్న 2.10 ఎకరాల భూమిని కుమారుడు నాకు తెలియకుండా పట్టా చేయించుకున్నాడు. 55ఏళ్లుగా సేద్యం చేస్తున్నా. వృద్ధాప్యంలో కుమారుడు నన్ను బాధపెడుతున్నాడు. నా ఇంటిని కూల్చివేశాడు. అనేకసార్లు కుమారుడు శంకర్‌రెడ్డి, కోడలు భవాని నన్ను, నా భార్యను కొట్టారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు. రెవెన్యూ అధికారులు కూడా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. చచ్చిపోలేక బతికున్నాం.. కుమారుడు, కోడలు వేధిస్తున్నారు. కేవలం వృద్ధాప్య పింఛన్ మీదే బతుకుతున్నాం. నేను పేద వాడినే కాక చదువురాని వాడిని. అందరి పెళ్లిళ్లు చేశా. నా కుమారుడు శంకర్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి హైదరాబాద్‌లో మూడంతస్తుల భవనం నిర్మించుకోగా, ప్రతి నెలా రూ.50వేల అద్దె కూడా వస్తుంది. కోడలు మహిళా మండలిలో లీడర్‌గా పనిచేస్తుంది. గత ఏడాది మే నెలలో నా పొలాన్ని స్వాధీనం చేసుకుని, ఇతరులకు విక్రయించేందుకు కుమారుడు, కోడలు విఫలయత్నం చేశారు. ఈ ఘటనను నిలదీసినందుకు నాపై, కుమార్తెలపై దాడి చేయించాడు. సమీపంలో నివసిస్తున్న కుమార్తె వచ్చి ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించింది. కుమారుడు, కోడలు దౌర్జన్యం నుంచి కాపాడి నా భూమిని, నా ఇంట్లో ఆక్రమించుకున్న పోర్షన్‌ను అప్పగించాలి.

అప్పులు చేసి నాపై నెట్టారు: శంకర్‌రెడ్డి

తండ్రి పాపిరెడ్డి అప్పులు చేసి నాపై నెట్టాడు. భూమిని తీసుకుని అప్పులు తీర్చి బాధ్యత తీసుకోవాలని చెప్పాడు. తనపై 2016లో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఈ క్రమంలో ఎస్‌ఐ బాలునాయక్, స్థానిక పెద్ద మనుషులు తనను, నా తండ్రిని పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. భూమి బదలాయిస్తున్నందుకు తండ్రికి భుక్తం కింద రూ.4 లక్షలు ఇచ్చేట్లు పెద్దమనుషుల సమక్షంలో ఒప్పందం కుదిరింది. ఆ మేరకు రూ.2 లక్షలు చేతికి, రూ.2లక్షలు జాయింట్(తండ్రీకుమారుల పేరుమీద) అకౌంట్‌లో వేసి వాటిపై వచ్చే వడ్డీని నేరుగా తండ్రి ఖాతాలో వేసేట్లు ఏర్పాట్లు చేశా. భూమి విక్రయించగా వచ్చిన వారికి తండ్రి అడ్డుచెప్పటంతో గత ఏడాది మే 26న రూ. 12 లక్షలు ఇచ్చేలా, మళ్లీ వివాదం రావటంతో గత నెల 17వ తేదీన ఆర్డీవో కౌన్సిలింగ్ అనంతరం రూ.14 లక్షలు తల్లిదండ్రులకు ఇచ్చేందుకు తీర్మానం చేసుకున్నాం. అయినప్పటికీ తండ్రి వినడంలేదు. ఈ నేపథ్యంలో పోలీస్‌స్టేషన్‌లో, ఆర్డీవోకు తనపై ఫిర్యాదు చేశాడు.

కౌన్సెలింగ్ చేసి పంపాం: సీహెచ్ కృష్ణయ్య, ఆర్డీవో

శంకన్నగూడెంకు చెందిన సామ పాపిరెడ్డి గతేడాది డిసెంబరులో తన కుమారుడు శంకర్‌రెడ్డి తన భూమిని తనకు తెలియకుండా పట్టా చేసుకున్నాడని, తనకు భుక్తం ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశాడు. జనవరి 17న ఇరువురికి నోటీసులు అందజేసి కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇచ్చాం. తండ్రి పాపిరెడ్డి కుమారుడి నుంచి రూ.14లక్షలు ఆశించగా రూ.10 లక్షలు ఇద్దరి పేరున బ్యాంకు డిపాజిట్ చేయాలని మిగతా రూ.4 లక్షలు చేతికి ఇవ్వాలని, వారిద్దరూ వారి వెంట వచ్చిన వారితో మాట్లాడుకుని ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత పాపిరెడ్డి నుంచి కానీ శంకర్‌రెడ్డి నుంచి ఫిర్యాదులు అందలేదు.

పెద్దమనుషుల సమక్షంలో తీర్మానం చేసుకున్నారు: ఎస్ఐ వెంకటరెడ్డి

ఈ ఏడాది జనవరి 2న శంకన్నగూడెం గ్రామానికి చెందిన సామ పాపిరెడ్డి, కుమారుడు సామ శంకర్‌రెడ్డి, కోడలు భవానీ తనపై దాడి చేశారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఆ ఫిర్యాదు మేరకు శంకర్‌రెడ్డి, భవాని వారి బంధువులు ఏనుగు నాగిరెడ్డి, శంభారెడ్డిలపై ఆత్మకూర్(ఎస్) పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశాం. జనవరి 17న ఆర్డీవో కార్యాలయంలో పెద్ద మనుషుల సమక్షంలో వారు సమస్య పరిష్కారానికి తీర్మానం చేసుకున్నారు.

నిధులు స్వాహా చేసిన వారిపై చర్యలు తప్పవు


సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాణి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 17: గ్రామాభివృద్ధి కోసం కేటాయించిన నిధులను ఎంపీపీ, ఎంపీడీవోలు స్వాహా చేశారని, వారిపై చర్యలు తప్పవని ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య అన్నారు. శనివారం మండలంలోని మంగళ్ తండా గ్రామంలో రూ.10లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిధుల దుర్వినియోగమైన విషయం విచారణలో బయటపడిందన్నారు. ఇప్పటికే ఎంపీడీవోపై చర్యలు తీసుకోగా, ఎంపీపీపై కూడా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ క్రిష్ణకుమారి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు రేపూరి వెంకటాచారి, శ్రీనివాసరావు, జబ్బార్, వీరునాయక్, కార్యదర్శి స్వాతి పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉండేది కమ్యూనిస్టులే


జెర్రిపోతులగూడెంలో మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

చిలుకూరు, ఫిబ్రవరి 17 : కార్మికులు, కర్షక, పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండేది కమ్యూనిస్టు పార్టీలేనని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు నంద్యాల రాంరెడ్డి సీపీఐలో చేరిన సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌ను వదిలి మాతృ సంస్థ సీపీఐలో 45 కుటుంబాలతో రాంరెడ్డి చేరడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు రెమిడాల రాజు, కొండా కోటయ్య, చేపూరి కొండలు, రామిశెట్టి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీవో సంజీవ

ఆత్మకూర్(ఎస్), ఫిబ్రవరి 17 : ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో సంజీవ అన్నారు. శనివారం పలు గ్రామమాల్లో విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మండలవ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో ప్రత్యేకాధికారులు గ్రామసభలు నిర్వహించి, పథకం లక్ష్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా కులవృత్తుల్లోని వారికి రూ.2 లక్షల రుణ సౌకర్యం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కోడి గుడ్లతో రూపొందించిన ఎగ్‌డే ఆకృతి

నడిగూడెం, ఫిబ్రవరి 17: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని నడిగూడెం సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ బీ .సులోచన అన్నారు. శనివారం పాఠశాలలో ఎగ్‌డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రోజూ కోడి గుడ్డుతో పాటు ప్రొటీన్లు, విటమిన్లు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కోడి గుడ్లతో ఏర్పాటుచేసిన ఎగ్‌డే ఆకృతి ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లెక్కలు రావడం లేదని
విద్యార్థిని చితకబాదిన టీచర్


గాయపడిన విద్యార్థి ప్రేమ్‌కుమార్

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 17 : లెక్కలు రావడం లేదని విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదాడు. ఈ సంఘటన హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలో చోటుచేసుకుంది. విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం బూరుగడ్డ గ్రామంలోని వీరబాబు, స్వాతిల కుమారుడు మేడిగ ప్రేమ్‌కుమార్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. కాగా లెక్కలు సరిగా చేయడం లేదని టీచర్, హెచ్‌ఎం జీ కాంతయ్య శనివారం చిన్నారి తీవ్రంగా కొట్టాడు. దీంతో బాలుడి వీపు మీద ఎర్రగా వాతలు వచ్చాయి. దీంతో విద్యార్థి నొప్పులు భరించలేక ఇంటి వెళ్లాడు. కాగా ఇంటి వద్ద ఏడుస్తుండగా గమనించిన తల్లిదండ్రులు ప్రేమ్‌కుమార్‌ను అడిగారు. సార్ కొట్టాడని చెప్పడంతో తల్లిదండ్రులు తీవ్ర మనస్థాపం చెందారు. దీంతో పాఠశాలకు వెళ్లగా అప్పటికే ఉపాధ్యాయుడు ఇంటి వెళ్లిపోయాడు. కాగా విద్యార్థి నొప్పులబాధను తట్టుకోలేకపోవడంతో ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఈ ఘటనపై ఎంఈవో సైదానాయక్‌ను వివరణ కోరగా సోమవారం పాఠశాలకు వచ్చి విచారణ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాఉండగా గతంలో ఇదే ఉపాధ్యాయుడు విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తించినట్లు ఆరోపణలున్నాయి. ఉపాధ్యాయుడి వివరణ కోసం ప్రయత్నించగా ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవాలు

తిరుమలగిరి రూరల్ / హుజూర్‌నగర్ / అర్వపల్లి / ఆత్మకూర్(ఎస్), ఫిబ్రవరి 17 : తిరుమలగిరి మండలం జలాల్‌పురం గ్రామ ఉన్నత పాఠశాల, తొండ ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోత్సాహకంగా బహుమతులను అందజేశారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. అర్వపల్లి మండలం తిమ్మాపురం ఉన్నత పాఠశాల్లో స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ పాత్రలు పోషించి ఆకట్టుకున్నారు. ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



స్వపరిపాలన దినోత్సవంలో తిరుమలగిరి ఆదర్శ పాఠశాల విద్యార్థులు

తెలంగాణ అభివృద్ధి కేసీఆర్‌తోనే సాకారం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తెలంగాణ రాష్ట్ర అభివృది కేసీఆర్‌తోనే సాధ్యమైందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం మాజీ సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కోదాడలోని పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి అన్నంపెట్టే స్థాయి రాష్ట్ర ఎదిగిందన్నారు.

సూర్యాపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భారీ కేక్‌కట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, సహాయకులకు పండ్లు పంపిణీ చేశారు. రాజీవ్‌నగర్‌లో అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, వైస్‌చైర్మన్ పుట్ట కిషోర్, నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, గండూరి ప్రకాష్, జడ్పీటీసీ జీడిబిక్షం, డాక్టర్ రామూర్తి యాదవ్, రమేష్, భరత్‌మహాజన్ పాల్గొన్నారు.

సూర్యాపేటలోని జనగాం క్రాస్‌రోడ్డు వద్ద జడ్పీటీసీ జీడీ భిక్షం భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌నాయుడు, నాయకులు కక్కిరేణి నాగయ్యగౌడ్, బైరెడ్డి బీంరెడ్డి పాల్గొన్నారు.

నేరేడుచర్లలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్, నాయకులు దొండపాటి అప్పిరెడ్డి, చెన్నబోయిన సైదులు, నాగండ్ల శ్రీధర్, లచ్చిరెడ్డి, జయబాబు, సైదులు పాల్గొన్నారు.


కోదాడలో కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

తుంగతుర్తిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, ఎంపీపీ గుండగాని కవిత రాములు, దొంగరి శ్రీనివాస్, శ్రీనివాస్ సమక్షంలో కేక్‌కట్ చేశారు.

చిలుకూరులోని బాపూజీ గ్రంథాలయంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమణ నాగయ్య, డీఎల్‌డీఏ డైరెక్టర్ నర్సయ్య, అన్నపూర్ణ, గ్రంథాలయ చైర్మన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో స్వీట్లు పంచి, బాణాసంచా పేల్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లోని మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి బెల్లంకొండ అమర్, కౌన్సిలర్ జక్కుల వీరయ్య, జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, కేఎల్ఎన్‌రెడ్డి, ఆలీపాషా పాల్గొన్నారు.

మద్దిరాల మండలకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రజాక్, నాయకులు శ్రీరాంరెడ్డి, దుగ్యాల రవీందర్‌రావు పాల్గొన్నారు.

నడిగూడెం బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోనగిరి ఉపేందర్, బడేటి చంద్రయ్య, సతీష్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ మండలం అనంతారం క్రాస్‌రోడ్డు వద్ద నిర్వహించిన వేడుకల్లో జడ్పీటీసీ మామిడి అనిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగంధర్, మామిడి అంజయ్య, నాతాల జానకిరాంరెడ్డి, బిట్టు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ దండు మైసమ్మ దేవాలయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చౌదరి నరసింహారావు, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, మర్ల చంద్రారెడ్డి, ముద్దం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నాగారం మండల కేంద్రంలో కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి చిల్లర చంద్రమౌళి, అంబయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.

గరిడేపల్లి మండల కేంద్రంలో కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, ఎంపీటీసీ కడియం స్వప్న, మాజీ సర్పంచ్ సీతారాంరెడ్డి, జోగు అరవిందరెడ్డి పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటుతో నెరవేరిన చిరకాల కోరిక


ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిరుమలగిరి / తిరుమలగిరి రూరల్, ఫిబ్రవరి 17 : రాష్ట్ర ప్రభుత్వం తిరుమలగిరి కేంద్రంలో ప్రభుత్వ కళాశాలను మంజూరు చేయడంతో చిరకాల కోరిక నెరవేరిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే మందుల సామేల్ కోరిక మేరకు కళాశాలను మంజూరు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రకటించారు. దీంతో ఎమ్మెల్యే సామేల్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ధరావత్ జుమ్మిలాల్, సుంకరి జనార్ధన్, సంకెపల్లి కొండల్‌రెడ్డి, మూల అశోక్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, కందుకూరి లక్ష్మయ్య, తిరుమని యాదగిరి, బర్ల సోమనర్సయ్య, గిలకత్తుల ప్రియలతరాముగౌడ్ పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు దాచేపల్లి వెంకన్న, వేణురావు, విద్యార్థి సంఘం నాయకులు ఎర్రగొల్ల లింగయ్యలు హర్షం వ్యక్తం చేశారు. జలాల్‌పురం గ్రామంలో వారు మాట్లాడుతూ కళాశాల ఏర్పాటు విద్యార్థుల ఉన్నత చదువులకు దోహదపడుతుందన్నారు.

కిరాణ దుకాణంలోకి దూసుకెళ్లిన కారు


దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

ఆత్మకూర్(ఎస్), ఫిబ్రవరి 17: మండలంలోని నశీంపేట గ్రామంలో శనివారం రాత్రి అతివేగంగా వచ్చిన ఒక కారు, రోడ్డు పక్కన ఉన్న కిరాణం దుకాణంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కిరాణ దుకాణ యజమానికి స్వల్పగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాకకు చెందిన శృంగవరపు శ్రీనివాస్‌రెడ్డి తన అత్తగారిల్లు నశీంపేటకు కారులో వస్తున్నాడు. ఒక్క నిమిషంలో ఇల్లు చేరుకోవాల్సి ఉండగా, అతివేగంగా వచ్చిన శ్రీనివాస్‌రెడ్డి కారు రోడ్డు పక్కన ఉన్న మూల ఎల్లయ్య కిరాణం దుకాణంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో ఎల్లయ్య కౌంటరలో కూర్చొని ఉన్నాడు. షాప్ ముందు ఒక పిల్లర్ స్తంభం ఉండటంతో కారు ఢీకొని ఆగిపోయింది. దీంతో పెనుప్రమాదం తప్పింది. గాయపడ్డ ఎల్లయ్యను చికిత్స కోసం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు.

మట్టపల్లిలో లక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం


మామిళ్లమడవలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న అర్చకులు, అర్వపల్లిలో ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

మఠంపల్లి, ఫిబ్రవరి 17 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో స్వామివారి నిత్యకల్యాణాన్ని భక్తుల ఆధ్వర్యంలో శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్యపూజల అనంతరం స్వామి వారి కల్యాణతంతును వేదపండితులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, అంజనేయచార్యుల ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, అర్చకులు తెలిపారు.

20 నుంచి అర్వపల్లిలో బ్రహ్మోత్సవాలు

అర్వపల్లి : అర్వపల్లి శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 20 నుంచి జరుగుతాయని ఆలయ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం వార్షికోత్సవ కరపత్రాలను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దరూరి యోగానందచార్యులు మాట్లాడుతూ స్వామి వారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు రాంబాబు, పవన్, మోరపాక సత్యం, వేల్పుల రమేష్, బైరబోయిన సైదులు, మహారాజ్, కోటి ప్రసాద్, సోమయ్య, రేణుక, నసీర్‌గౌడ్, ఉపేందర్ పాల్గొన్నారు.

మాలిపురంలో బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం

తిరుమలగిరి: పట్టణపరిధిలోని మాలిపురంలో తృతీయ బొడ్రాయి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు బొడ్రాయికి జలాభిషేకం నిర్వహించారు. ప్రతి ఇంటి ర్యాలీగా బోనాలు తీసుకెళ్లి సమర్పించారు. పూజారులు హోమం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, తిరుమని యాదగిరి, రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, దీన్‌దయాల్, మేడబోయిన యాదగిరి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

మామమిళ్లమడవలో విగ్రహ ప్రతిష్ఠ

మద్దిరాల: మండలంలోని మామిళ్లమడవ గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. శనివారం ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా కళ్యాణమహోత్సవం నిర్వహించారు. అజ్మీర రవి ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నూకల జగన్‌రెడ్డి, మల్లు కపోతంరెడ్డి, వాసంపెల్లి వెంకట్‌రెడ్డి, మల్లు కళింగరెడ్డి, మల్లు ఉపేందర్‌రెడ్డి, సలేందర్‌రెడ్డి, బిచ్చునాయక్ తదితరులు పాల్గొన్నారు.

20 క్వింటాల పీడీఎస్ బియ్యం పట్టివేత

గరిడేపల్లి, ఫిబ్రవరి 17 : అక్రమంగా రవాణా చేస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ఈటె సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అబ్బిరెడ్డిగూడెం క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తుండగా సాయంత్రం 5 గంటల సమయంలో టీఎస్ 05యూసీ 7414 నెంబర్ గల వాహనం అనుమానాస్పదంగా కనిపించడంతో డ్రైవర్ చిలకరాజు రాంబాబును విచారించారు. కొన్నాళ్లుగా పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన పిండిప్రోలు పర్వతాలు పలు గ్రామాల్లో పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి విక్రయిస్తుంటాడని, పర్వతాలు వద్ద కొంతకాలంగా డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నానన్నారు. మండలంలోని సర్వారం గ్రామంలో గుగులోతు రాము పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి పర్వతాలకు విక్రయించగా సర్వారం వెళ్లి ఆ బియ్యాన్ని తన వాహనంలో నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామపంచాయతీ కార్యలయంలో షార్ట్‌సర్క్యూట్

పాలకవీడు, ఫిబ్రవరి 17 : పాలకవీడు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్‌తో కార్యాలయంలో పొగ కమ్ముకుంది. దీంతో స్పందించిన గ్రామస్థులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి మంటలు ఆర్పివేశారు. కార్యాలయ వెనక భాగంలోని విద్యుత్ మోటారు వైర్లు కాలిపోవడంతో పొగలు వ్యాపించి, మంటలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సకాలంలో స్పందించడంతో ఇతర సామగ్రికి కాలిపోలేదు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ రమాదేవి

కోదాడ టౌన్, ఫిబ్రవరి 17 : స్వర్ణభారతి ట్రస్ట్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని మునిసిపల్ కమిషనర్ రమాదేవి అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో బొడ్రాయిబజార్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చలివేంద్రం పట్టణానికి వచ్చే బాటసారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాస్, వంగవీటి రామారావు, పైడిమర్రి వెంకటనారాయణ, వెంపటి మధుసూదన్‌రావు, జగిని ప్రసాద్, యాద సుధాకర్, బండారు శ్రీనవాసరావు, సాయి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కరవిరాల విద్యార్థి పరికరం


లైఫ్ సేవ్ స్టిక్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థి పృధ్వీ

నడిగూడెం, ఫిబ్రవరి 17 : మండలంలోని కరవిరాల ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పృధ్వీ రూపొందించిన లైఫ్ సేవ్ స్టిక్ రాష్ట్రస్థాయి ఇన్‌స్పైయిర్ పోటీలకు ఎంపికైంది. రైతులకు ఉపయోగపడేలా ఈ పరికరాన్ని తయారు చేసినట్లు పృధ్వీ తెలిపారు. రాత్రి పూట పొలాలకు వెళ్లే రైతులకు విషజంతువు బారిన పడకుండా ఈ స్టిక్ కాపాడుతుందని, రైతులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ప్రయోగత్మకంగా ఇన్‌స్పైయిర్ పోటీల్లో ప్రదర్శించడంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్ తెలిపారు. విద్యార్థి పృధ్వీని ప్రిన్సిపాల్ షరీఫ్, ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 17: మండలంలోని తమ్మర గ్రామంలో ఎస్సీల కోసం కేటాయించిన భూమిని గ్రామానికి చెందిన కనగాల పూర్ణ, కొండయ్య ఆక్రమిస్తున్నారని కాలనీవాసులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. 1984లో ప్రభుత్వం ఎస్సీలకు కేటాయించిన స్థలం మిగిలిన రెండు ఎకరాలను కాలనీవాసుల అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు వివరించారు. ఆ భూమి తమదేనంటూ ఇరువురు సర్వే చేసేందుకు ప్రయత్నించారని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరారు. కాలనీవాసుల ఫిర్యాదుపై విచారణ చేసి, తగు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో సూర్యనారాయణ తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన భాషం సైదులు

చిలుకూరు, ఫిబ్రవరి 17: మండలంలోని బేతవోలు ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా శనివారం బాషం సైదులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. సంఘంలో అవినీతి ఆరోపణలతో జిల్లా సహకార అధికారికి ఫిర్యాదుచేయడంతో చైర్మన్‌గా సైదులును తప్పించారు. ఆయన స్థానంలో బజ్జూరి రవీందర్‌రెడ్డి తాత్కాలిక చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. అయితే సైదులు తనను తొలగించడంపై హైకోర్టును ఆశ్రయించడంతో సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ హైకోర్టు స్టేఆర్డర్ విధించింది. దీంతో డీసీవో శ్రీధర్ ఆదేశాల మేరకు సీఈఓ పాషా మరోసారి సైదులుకు చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు.

నడిగూడెం కళాశాలకు క్రీడాసామగ్రి విరాళం

నడిగూడెం, ఫిబ్రవరి 17: నడిగూడెం జూనియర్ కళాశాలకు డీఫైర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రూ.8500 విలువైన క్రీడాసామాగ్రిని శనివారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోమయ్య, సంస్థ ప్రతినిధులు దున్న సతీష్, లతీఫ్, నాగరాజు, లక్ష్మికాంత్, బాలకృష్ణ, పాపయ్య, వీరన్న, శోభరాణి, గురవయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీని సన్మానించిన దివ్యాంగుల సంఘం నాయకులు

సూర్యాపేటఅర్బన్, ఫిబ్రవరి 17: సూర్యాపేట డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జీ రవిని దివ్యాంగుల సంఘ రాష్ట్ర నాయకులు నేంద్ర మల్లారెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయనతోపాటు గుండా గోపినాథ్ పుష్పగుచ్ఛం అందజేశారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కోదాడ రూరల్, ఫిబ్రవరి 17 : మండలంలోని గుడిబండ గ్రామం వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను శనివారం పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెల్లవారుజామున ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తీసుకుని కోదాడకు వస్తుండగా, గుడిబండ వద్ద పట్టుకుని సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

తిరుమలగిరి, ఫిబ్రవరి 17: తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలోని మోడల్‌స్కూల్, కృష్ణవేణి పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు శనివారం వీడ్కోలు సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాటలు, నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఎంఈవో శాంతయ్య, పాఠశాలల హెచ్‌ఎం బాలరాజు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కళాకారులను ఆదరించాలి

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 17 : ప్రభుత్వం కళాకారులను ఆదరించాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు దొంతగాని సత్యనారాయణ కోరారు. శనివారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జాతరలు, పండుగల సందర్భంగా కళా ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. సమావేశంలో జొన్నలగడ్డ గోవింద్, సుధీర్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సూర్యాపేటసిటీ: మోతె మండలం సిరికొండ గ్రామానికి చెందిన తల్లిదండ్రులు లేని విద్యార్థిని కొడిరెక్క వెన్నెలకు సూర్యాపేట మునిసిపాలిటీ క్రిస్టియన్ కో-ఆప్షన్ సభ్యురాలు పెద్దపంగు స్వరూప రూ.5 వేలు అందజేశారు. వెన్నెలకు ఆర్థికసాయం చేయడానికి దాతాలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ జిల్లా నాయకులు పెద్దపంగు పూర్ణశశికాంత్, పాటి శ్రీకాంత్‌రెడ్డి, పుల్లూరి ప్రీతి పాల్గొన్నారు.

పాలకవీడు : పీఎం విశ్వకర్మ యోజన పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీటీసీల మండల ఫోరం అధ్యక్షుడు మీసాల ఉపేందర్ కోరారు. నాగిరెడ్డిగూడెం గ్రామసభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జ్యోతి, అనూష, సైదులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండలంలోని రెడ్డిగూడెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్నాక్స్‌ను కంచరదాసు మెమోరియల్ ట్రస్టు సభ్యులు దుగ్యాల శేషగిరిరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్బయ్య, జక్కుల సూరయ్య, బరపటి రేణుక, సిబ్బంది పాల్గొన్నారు.

నాగారం : మండల యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జిగా వల్లాల భాను ప్రకాష్‌ను నియమిస్తూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పీ గణేష్‌రెడ్డి ఉత్వరులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భానుప్రకాష్‌ను ఫణిగిరి గ్రామంలో నాయకులు పానుగంటి నర్సింహరెడ్డి, నాతి వీరమల్లు, బాలకృష్ణ సన్మానించారు.

మఠంపల్లి : మండలంలోని కాల్వపల్లితండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు దాతలు అందజేసిన బ్యాగులు, నోట్ పుస్తకాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల అందజేశారు. ఈ సందర్భంగా దాతలు బానోతు నాగరాజు, భూక్య లచ్చిరాం, సత్యనారాయణ, రాజ్యలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : స్వేరోస్ నెట్‌వర్క్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన పాముల రాకేష్, ప్రధాన కార్యదర్శిగా చెరుకుపల్లి గోపి ఎన్నికైనట్లు జిల్లా జాయింట్ సెక్రటరీ నాగార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కిరణ్, విజయనిర్మల, జ్యోతిరాణి, సుధాకర్, సుజాత పాల్గొన్నారు.

కుల గణన చేపట్టడం హర్షనీయం

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 17 : రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టడం హర్షనీయమని బీసీ సంఘం నాయకులు పీ రవి, రాజశేఖర్, ఉపేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని టౌన్‌హాల్‌లో మహాత్మా జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్నో ఏళ్లుగా కులగణన చేపట్టాలని కోరినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేస్తామని అసెంబ్లీలో ప్రకటించడం గొప్పవిషయమన్నారు. చట్టబద్ధత కూడా కల్పించాలని ఆయన కోరారు. సమావేశంలో మురళి, శ్రీనివాస్, వెంకన్న, రాము పాల్గొన్నారు.